# 70 కేంద్రాల్లో కొనుగోళ్లు సున్నా

**ప్రారంభించినవి 7,104 కేంద్రాలు • కొనుగోళ్లు మాత్రం 2,480 సెంటర్లలో • కొన్నది 6.75 లక్షల టన్నులు మాత్రమే • కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు**

హైదరాబాద్, ఏప్రిల్ 22(నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోళ్ల అంశంలో పౌరసరఫరాల సంస్థ మాటలు కోటలు దాటుతుంటే, చేతలు మాత్రం గడప దాటడం లేదు. 7 వేలకుపైగా కేంద్రాలు ఏర్పాటుచేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు ప్రభుత్వం గొప్పగా చెప్తున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. 70 శాతానికి పైగా కేంద్రాల్లో ఇప్పటి వరకు ఒక్క గింజను కూడా కొనుగోలు చేయలేదు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల ప్రారంభించి ఇప్పటికి మూడువారాలు పూర్తయినా కొన్నది 6.75 లక్షల టన్నులు మాత్రమే. దీని నిబట్టి కొనుగోళ్లపై ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. యాసంగి ధాన్యం కొనుగోలుకు రాష్ట్రవ్యాప్తంగా 7,200 కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావించిన పౌరసరఫరాలశాఖ 7,104 కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంభించింది. వీటిలో 2,480 కేంద్రాల్లో మాత్రమే కొనుగోళ్లు ప్రారంభించారు. ఇంకా 4,720 కేంద్రాలు అంటే దాదాపు 70 శాతానికిపైగా కేంద్రాల్లో ఒక్క గింజ ధాన్యాన్ని కూడా కొనుగోలుచేయలేదు.

**ఎడతెగని ఎదురుచూపులు**

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులు రోజుల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొన్నది. మరోవైపు, అకాల వర్షం అన్నదాతను భయపెడుతున్నది. అకస్మాత్తుగా కురిసే వాన నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. అకాల వర్షానికి కొన్నిచోట్ల ధాన్యం తడిచిపోతుంటే, మరికొన్నిచోట్ల కొట్టుకుపోతున్నది. తడిచిన ధాన్యానికి మొలకలు వస్తుండడంతో అన్నదాత ఆవేదన చెప్పనలవి కాకుండా ఉన్నది. ప్రభుత్వం ముందే కొనుగోళ్లు కేంద్రాలు పెట్టి ధాన్యం కొనుగోలు చేసి ఉంటే ఈ ఇబ్బందులు తప్పి ఉండేవని రైతులు చెప్తున్నారు.

జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని ధర్నా చేస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

## బాంచెన్.. కాల్మొక్తా

- జనగామ మార్కెట్‌లో వడ్లు కొనండి సారూ
- పోలీసుల కాళ్లు పట్టుకొని మహిళా స్వీపర్ వేడుకోలు
- యార్డులో ధాన్యం కొనాలని సీపీఎం, సీఐటీయూ ధర్నా

జనగామ, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): 'బాంచెన్.. మీ కాల్మొక్తా.. వడ్లు కొనుండి సారూ.. 12 రోజులుగా మార్కెట్ మూతపడ్డది. కూలి దొరకక తిండికి తిప్పలవుతున్నది. నాకు భర్త, పిల్లలు లేరు. 30 ఏండ్లుగా కల్లాలు ఊడ్చి రైతులు పెట్టే నాలుగు గింజలు అమ్ముకొని బతుకుతున్న. వీళ్లేమో ఇట్లా చేయబట్టిరి.. ఏం చేయాలే.. ఎక్కడికి పోవాలే' అంటూ.. జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్ల నిలిపివేతతో ఉపాధి కోల్పోయిన ప్రైవేట్ మహిళా స్వీపర్ (దినసరి కూలీ) ఆవేదన వ్యక్తం చేసింది. మార్కెట్‌ను మళ్లీ తెరిచి అన్ని రకాల ఉత్పత్తుల కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం మార్కెట్‌యార్డు కార్యాలయం వద్ద మార్కెట్ హమాలీలు, దడువాయిలు, చాట, చీపురు కార్మికులు, కూలీలు ధర్నా చేపట్టారు. ఇదంతా అక్కడే ఉండి గమనించిన స్వీపర్ అనురాధ.. వాళ్లు చేస్తున్నది తమ కోసమే కదా అని ధర్నాలో పాల్గొన్నది. ఈ క్రమంలో పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకుంటుండగా.. అనురాధ పోలీసు అధికారుల కాళ్లు పట్టుకొని 'మార్కెట్ తెరిపించుండ్రి సారూ' అంటూ ప్రాధేయపడింది. ఆమె ఆవేదనను ఏ మాత్రమూ పట్టించుకోని పోలీసులు 'పక్కకు జరుగమ్మా' అంటూ పలువురిని బలవంతంగా స్టేషన్‌కు తరలించారు. దీంతో కొద్దిసేపు మార్కెట్ యార్డు వద్ద ఉద్రిక్తత నెలకొన్నది.

**12 రోజులుగా ఉపాధి లేదు**

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రైవేటు ఖరీదుదారులు సిద్ధంగా లేనందున.. వ్యవసాయ మార్కెట్‌కు రైతులు ఎలాంటి ఉత్పత్తులను తేవద్దని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మార్కెట్ కమిటీ అధికారులు యార్డు గేట్లకు తాళాలు వేశారు. రైతుల ఆందోళనతో ఈ నెల 16న యార్డులో నిల్వ ఉన్న ధాన్యాన్ని మద్దతు ధర కంటే క్వింటాకు రూ.500 తక్కువకు కొనుగోలు చేసి బస్తాలను గోదాంలు, మిల్లులకు తరలించారు. కొనుగోళ్లు లేక యార్డు వెలవెలబోతుండగా.. వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు, కొనుగోళ్లపై ఆధారపడిన దాదాపు 400 మంది హమాలీ కార్మికులు, దడువాయిలు, గుమస్తాలు, చాట, చీపురు కూలీలు, ప్రైవేట్ స్వీపర్లు 12 రోజులుగా ఉపాధి కోల్పోయారు. ఈ నెల 10న మార్కెట్‌లో ఆందోళన తర్వాత.. జిల్లా యంత్రాంగం యార్డులోపల ఐకేపీ, పీఏసీఎస్, సివిల్‌సప్లయి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. అయితే.. అధికారులు మార్కెట్ గేట్లకు తాళాలు వేయడంతో ఈ కేంద్రాలకు ధాన్యం తెచ్చే అవకాశం లేకుండాపోయింది. దీంతో దినసరి కూలీలు, కార్మికులు రోడ్డున పడ్డారు.

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం రాయికుంటలో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

ఆసిఫాబాద్ జిల్లా కెరమెరిలో నేలకొరిగిన మక్క

## అకాల నష్టం

**నేలరాలిన మామిడి.. తడిసిన ధాన్యం**

- విరిగిన చెట్లు..విద్యుత్తు స్తంభాలు
- పిడుగుపాటుకు ఎద్దు మృతి

(నమస్తే తెలంగాణ, న్యూస్‌నెట్‌వర్క్)

అకాల వర్షాలు అన్నదాతలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. గాలివాన బీభత్సానికి ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, నల్లగొండ జిల్లాల్లో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆదివారం రాత్రి కురిసిన గాలివానకు మామిడికాయలు నేలరాలాయి. చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకూలాయి. నిమ్మతోటలు భారీగా దెబ్బతిన్నాయి. ఇండ్ల పైకప్పులు, రేకులు ఎగిరిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. చాలా చోట్ల వడ్లు తడిసిపోగా రైతులు కన్నీరు పెడుతున్నారు. సోమవారం వరద నీటిలో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుకునే పనిలో నిమగ్నమయ్యారు. అసలే నీళ్లు లేక అరకొరగా పండిన ధాన్యం ఇప్పుడు ఇలా తడిసి నష్టపోవాల్సి వస్తున్నదని రైతులు కన్నీరు పెడుతున్నారు. ప్రభుత్వం ధాన్యం కేంద్రాల్లో వసతులు కల్పించాలని, కొనుగోళ్లను వేగవంతం చేయాలని వేడుకుంటున్నారు.ఇక కరీంనగర్‌లో పిడుగుల శబ్దం దద్దరిల్లింది. కామారెడ్డి ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వెనుక ఓ చెట్టు నేలకూలింది. నవీపేట మండలంలోని మోకన్‌పల్లిలో పిడుగుపాటుకు మిర్యాల ఒడ్డెన్నకు చెందిన ఆవు మృతి చెందింది. దోమకొండలో ఓ ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరిచెట్టుపై పిడుగుపడింది. మహబూబాబాద్ జిల్లా సత్యనారాయణపురం గ్రామంలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగాయి. ఆసిఫాబాద్ జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

కామారెడ్డి జిల్లా దోమకొండలోని ఓ ఇంటిఆవరణలో చెట్టుపై పడిన పిడుగు

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలులో రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

## తడిసిన ధాన్యం కొనాలని రోడ్డెక్కిన రైతులు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 22: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు రహదారిపై సోమవారం రైతులు బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి అమ్మనబోలు కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిందని తెలిపారు. పంట చేతికి రాకపోవడంతో రైతులకు నష్టం వాటిల్లిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం ఆరబెట్టుకొని తీసుకురావాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు చెప్పడంపై వారు నిరసన తెలిపారు.రెండ్రోజులకోసారి లారీ లోడ్‌తో ఎగుమతి కావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. రోజుకు 4 లారీలతో ఎగుమతి చేస్తే తమకు ఈ పరిస్థితి వచ్చేది కాదని వారు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పౌరసరఫరాల అధికారులు తడిసిన పంటను పరిశీలించారు.

అంకుర్ సీడ్స్‌తో నిరసన తెలుపుతున్న రైతులు

## రైతులను ముంచిన 'అంకుర్ సీడ్స్'

- అధిక దిగుబడి ఆశతో మోసపోయిన అన్నదాతలు
- ఫోన్లు చేసినా పట్టించుకోని కంపెనీ ప్రతినిధులు
- సమస్య పరిష్కరించాలని గణపురం ఎస్సై హెచ్చరిక

గణపురం, ఏప్రిల్ 22: అధిక దిగుబడి వస్తుందని ఆశపడ్డ అన్నదాతలను 'అంకుర్ సీడ్స్' ప్రతినిధులు నకిలీ విత్తనాలను అంటగట్టి నట్టేట ముంచారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. అంకుర్ సీడ్స్‌కు చెందిన కొందరు దళారులు మండల కేంద్రంలోని పలువురు రైతులను కలిసి.. 130 రోజుల పంట కాలం, మంచి దిగుబడి వచ్చే సీడ్‌ను సాగుచేయాలని, ధాన్యాన్ని అత్యధిక ధరకు తామే కొనుగోలు చేస్తామని నమ్మించారు. వారి మాయమాటలు నమ్మిన 23 మంది రైతులు.. అంకుర్ సీడ్స్ కొని 86 ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. అయితే.. మొక్క పెరగకపోగా 60 రోజులకు రావాల్సిన పొట్టదశ 35 రోజులకే వచ్చింది. 60 రోజుల్లోనే పంట కాలం పూర్తికాగా.. గొలుసు పెరగకపోవడంతో ఆశించిన మేర దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించలేదు. ఇదే విషయమై కంపెనీ ప్రతినిధులకు సమాచారం అందించామని, అప్పటి నుంచి తమ ఫోన్లు ఎత్తకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రైతులు దండు రాములు, దయ్యాల భద్రయ్య, మల్లయ్య, వడ్లకొండ దుర్వాసులు, వడ్లకొండ తిరుపతి, మామిండ్ల సారంగపాణి, పొట్లూరి సురేశ్, రవికుమార్ కలిసి సోమవారం స్థానిక ఎస్సై మచ్చ సాంబమూర్తికి విషయం తెలియజేశారు. తమవెంట తీసుకెళ్లిన వరి కంకులను చూపించారు. వెంటనే స్పందించిన ఎస్సై.. కంపెనీ ప్రతినిధులకు ఫోన్ చేసి రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సాగర్‌నీటి దోపిడీపై సర్కారు దోబూచులాట!

- నీటిని యథేచ్ఛగా మళ్లిస్తున్న ఏపీ
- ఇటీవలే టెయిల్‌పాండ్ నుంచి 3 టీఎంసీల మళ్లింపు
- నేటితో ముగియనున్న 5.5 టీఎంసీల సాగర్ నీటి కోటా
- మరో 2.5 టీఎంసీల నీరివ్వాలని కేఆర్‌ఎంబీకి ఏపీ వినతి
- జలాల తరలింపుపై ఏమాత్రం నోరెత్తని తెలంగాణ ప్రభుత్వం
- కేఆర్‌ఎంబీ మీటింగ్‌కూ డుమ్మా

హైదరాబాద్, ఏప్రిల్22 (నమస్తే తెలంగాణ): కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ యథేచ్ఛగా మళ్లించుకుపోతున్నా తెలంగాణ సర్కారుకు చీమకుట్టినట్టు కూడా లేకుండాపోయిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ప్రభుత్వం ఎక్కడా నోరెత్తకపోవడంతో ఏపీకి అడ్డే లేకుండా పోయిందని అభిప్రాయం వ్యక్తమవుతున్నది. తాజాగా కేఆర్‌ఎంబీ నిర్వహించిన సమావేశానికి సైతం రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ ఉన్నతాధికారులు డుమ్మా కొట్టడమూ ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ) నిర్వహణ బడ్జెట్ విడుదలకు సంబంధించి ఇరు రాష్ట్రాలతో సోమవారం కేఆర్‌ఎంబీ ప్రత్యేక సమావేశాన్ని వర్చువల్‌గా నిర్వహించింది. ఈ సమావేశానికి ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డి ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తొలుత కేఆర్‌ఎంబీ విడుదల చేయాల్సిన నిధులకు సంబంధించి ఏపీ ఈఎన్సీ మాట్లాడారు. ఇప్పటికే తెలంగాణ కంటే బోర్డుకు 8 కోట్లను అదనంగా విడుదల చేశామని, అదీగాక ప్రస్తుతం ఓటాన్ అకౌంట్ ఉన్న నేపథ్యంలో నిధులను విడుదల చేసే పరిస్థితి లేదని వివరించారు. తెలంగాణ తన కోటా నిధులను విడుదల చేసిన అనంతరం తాము విడుదల చేస్తామని బోర్డు చైర్మన్‌కు ఆయన స్పష్టం చేశారు.

**మరో 2.5 టీఎంసీలు ఇవ్వండి**

ఇటీవల నిర్వహించిన త్రీమెంబర్ కమిటీ సాగర్‌లో వినియోగానికి 14 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయని తేల్చింది. అందులో తెలంగాణకు 8.5 టీఎంసీలను, ఏపీకి 5.5 టీఎంసీలను కేటాయించింది. ఏపీ కోటాకు సంబంధించి 5.5 టీఎంసీల నీటి విడుదల మంగళవారంతో పూర్తికానున్నది. దీంతో బోర్డు అధికారులు సాగర్ కుడికాలువ గేట్లను బంద్ చేయాల్సి ఉన్నది. అయితే తాజా సమావేశంలో ఏపీ అందుకు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. గతంలో కోటాకు సంబంధించి ఏపీకి 2.5 టీఎంసీలు రావాల్సి ఉన్నదని తెలిపి, ఆ మేరకు సాగర్ నుంచి ప్రస్తుతం కుడికాలువ ద్వారా విడుదల చేస్తున్న నీటిని 26 వరకు కొనసాగించాలని ఈఎన్సీ నారాయణరెడ్డి కోరినట్టు సమాచారం. దీనిపై బోర్డులో భిన్నభిప్రాయాలు వెలువడుతున్నాయి. బోర్డు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ఏపీ సర్కారు ఇటీవల సాగర్ టెయిల్‌పాండ్ ప్రాజెక్టు నుంచి అక్రమంగా 3 టీఎంసీలను తరలించుకుపోయింది. తాజాగా నాగార్జున సాగర్ నుంచి మరో 2.5 టీఎంసీలను డిమాండ్ చేస్తున్నది. ఆయా అంశాలపై బోర్డు సమావేశంలో లేవనెత్తాల్సిన తెలంగాణ రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ అధికారులు మాత్రం ఏకంగా ఆ సమావేశానికి హాజరుకాకపోవడం గమనార్హం.

## డ్రోన్లతో పంట నష్టం అంచనా

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): విపత్తులతో పాటు వాతావరణ మార్పులు, తెగుళ్ల వల్ల పంటలకు వాటిల్లిన నష్టాన్ని హైరిజల్యూషన్ కెమెరాలతో కూడిన డ్రోన్ల సాయంతో అత్యంత కచ్చితంగా, వేగంగా అంచనా వేసేందుకు ఇక్రిశాట్, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ), వ్యవసాయ విస్తరణ విభాగం కలిసి నూతన విధానాన్ని అభివృద్ధి చేశాయి. దీన్ని బంగ్లాదేశ్‌లో ప్రయోగాత్మకంగా పరీక్షించామని, అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఈ విధానంతో పంట నష్టాన్ని నూటికి నూరు శాతం శాస్త్రీయంగా అంచనా వేయవచ్చని ఇక్రిశాట్ వర్గాలు వెల్లడించాయి. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే వివిధ రంగాల్లో డ్రోన్లను విరివిగా ఉపయోగిస్తున్నారు.వ్యవసాయంలోనూ క్రమంగా డ్రోన్లవినియోగం పెరుగుతున్నది. ప్రస్తుతం పొలాల్లో ఎరువులు, పురుగుమందులను చల్లేందుకు ఉపయోగిస్తున్న డ్రోన్ల సాయంతో ఇకపై పంట నష్టాన్నీ అంచనా వేయనున్నారు.

## ట్రాక్టర్ లోడుకు 35 కిలోల బాదుడు

- జనగామ జిల్లాలో మిల్లర్ల మాయాజాలం
- తరుగు పేరిట 2 కిలోల ధాన్యం కోత
- కూలీల ఖర్చుకు ఒక్కొక్క బస్తాకు రూ.10
- చెక్ ఇస్తే నూటికి రూ.2 కమీషన్
- మిల్లర్లకు వరంలా మార్కెట్ బంద్

జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు ధర నిర్ణయించడంలో జాప్యం, తక్కువ ధర నిర్ణయించడంతో ఈనెల 10న అన్నదాతలు ఆందోళనబాట పట్టారు. మూడు గంటలపాటు మార్కెట్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు కూడా రంగంలోకి దిగారు. చివరికి అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ రైతులతో చర్చించి శాంతింపజేశారు. మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వాదేశాలకు భిన్నంగా క్వింటాలుకు రూ. 600 తక్కువతో కొనుగోళ్లకు సిద్ధపడిన వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని ఆదేశించారు.

జనగామ వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన ఘటనపై సకాలంలో స్పందించి రైతులను మోసం చేసేందుకు ప్రయత్నించిన నలుగురు ట్రేడర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశించిన, నిర్లక్ష్యంగా వ్యవహరించిన మార్కెట్ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని ఆదేశించిన అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్ గారికి నా అభినందనలు
–సీఎం రేవంత్‌రెడ్డి (ఏప్రిల్ 11)

రైతులు అమ్ముకునే ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. రైతులను మోసం చేసే మిల్లర్లపై కఠినంగా వ్యవహరించాలి. వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసే మిల్లర్లు, ట్రేడర్ల ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేస్తాం. కస్టమ్ మిల్లింగ్ నిలిపివేసి బ్లాక్ లిస్టులో పెడతాం. –సీఎం రేవంత్‌రెడ్డి (ఏప్రిల్ 12)

సీఎం హెచ్చరికలతో ఆ తర్వాతి రోజున జనగామ మార్కెట్‌లో వ్యాపారులు క్వింటాలుకు రూ. 30 మాత్రమే పెంచారు. అప్పటి వరకు మద్దతు ధర రూ. 2,200కు బదులు రూ. 1,530 మాత్రమే ముట్టజెప్పిన వ్యాపారులు దానికి మరో రూ. 30 కలిపి కొనుగోలు చేశారు.

జనగామ, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): జనగామ మార్కెట్‌యార్డులో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలివి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరికలు ఏమాత్రం పనిచేయడం లేదని, చర్యలు తీసుకుంటామంటూ చేస్తున్న హెచ్చరికలు సైతం ఏమాత్రం ప్రభావం చూపలేకపోతున్నాయని చెప్పేందుకు ఇవి అద్దం పడుతున్నాయి. ధాన్యం అమ్ముకొనేందుకు అన్నదాతలు పడుతున్న కష్టాల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే అవుతుంది. రైస్ మిల్లర్లు, వ్యాపారులు, దళారులు, చిల్లరకాంట నిర్వాహకులు ఎవరికి తోచిన విధంగా వారు రైతులను దోచుకుంటున్నారు. కొనుగోళ్లు లేక, కొన్నా మద్దతు ధర రాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్రమకు తగిన ఫలితం లేక ఉసూరుమంటున్నారు. జనగామ మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడం జిల్లాలోని మిల్లర్లకు వరంలా మారింది. 12 రోజులుగా కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు నేరుగా మిల్లుల్లోకి వెళ్లి తక్కువ ధరకే ధాన్యం అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్కెట్‌లో మద్దతు ధరకు మాత్రమే కొనాలన్న నిబంధన పెట్టిన జిల్లా అధికార యంత్రాంగం కండ్లు మూసుకున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**తూకంలో మోసం.. ధరలో దగా**

మిల్లుల్లో కొనుగోళ్లపై అధికారికంగా ఎలాంటి రికార్డులు ఉండవు. తక్‌పట్టీ ఇవ్వరు. తెల్ల కాగితంపై అంకెలు, సంఖ్యలు తప్ప అమ్మినట్టు, కొన్నట్టు ఎలాంటి ఆధారం లేకుండా కొనుగోళ్లలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మద్దతు ధర రూ.2200 చెల్లించాల్సిన మిల్లర్లు క్వింటాలుకు రూ.1800 నుంచి రూ.1900 మించి కొనడంలేదు. మార్కెట్ ట్రేడ్ లైసెన్స్ ఉన్నప్పటికీ యార్డుకు వచ్చి కొనని వ్యాపారులు బయట ఇష్టారాజ్యంగా కొంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ లోడుకు 35 కిలోల చొప్పున బాదుతున్న మిల్లర్లు ధాన్యం తరుగు పేరిట బస్తాకు మరో 2 కిలోల కోత విధిస్తున్నారు. కూలీల ఖర్చుల కింద బస్తాకు రూ.10, అమ్ముకున్న వెంటనే డబ్బులు కావాలంటే రూ.2 చొప్పున కమీషన్ కట్‌చేసి చెక్ రాసి ఇస్తున్నారు. మార్కెట్‌లో కొంటే క్రయ విక్రయాలకు సంబంధించిన రికార్డు చూపాల్సి ఉంటుంది. అదే చిల్లర కాంటాలు, మిల్లుల్లో కొనుగోలు చేస్తే ఇలాంటివి అవసరం లేదు కాబట్టే అటు మిల్లుల్లోనూ, ఇటు బయట చిల్లర కాంటా వ్యాపారుల వద్ద కూడా ఇదే రకమైన దోపిడీ కొనసాగుతున్నది.

**రైతుల సొమ్ము రియల్ ఎస్టేట్‌లోకి**

జనగామ జిల్లాలో రైస్ మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ (సీఎంఆర్) బియ్యాన్ని ప్రభుత్వానికి నిర్దేశించిన గడువులో తిరిగి ఇవ్వకుండా బయట అమ్ముకొని వ్యాపారాలకు సొమ్ము మళ్లిస్తున్నట్టు తెలిసింది. ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యాన్ని మిల్లింగ్ చేసిన జిల్లాలోని కొందరు రైస్ మిల్లర్లు బయటి మార్కెట్‌లో ఎక్కువ ధరకు అమ్ముకుంటే, ఇంకొందరు బియ్యానికి అధిక ధర పలికే ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. అక్కడ తక్కువ ధరకు లభించే బియ్యాన్ని ఇక్కడకు తీసుకొచ్చి సీఎంఆర్ కింద ఎఫ్‌సీఐకి పెడుతున్నట్టు తెలిసింది. జిల్లాలో రైస్ మిల్లర్లు 54,225 టన్నుల కస్టమ్ మిల్లింగ్ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు ఇచ్చింది 22,142 మెట్రిక్ టన్నులు (సుమారు 40శాతం) మాత్రమే. అంటే ఇంకా మిల్లర్లు బకాయి పడ్డది 32,083 టన్నులు(60 శాతం). ఈ ఏడాది ఇవ్వాల్సిన సీఎంఆర్ బియ్యాన్ని వచ్చే ఏడాది వరకు ఇవ్వకుండా బకాయి పెట్టి, ముందుగానే అమ్ముకుంటూ వచ్చిన సొమ్మును రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ రంగాలకు పెట్టుబడి పెట్టడం లేదా వడ్డీ వ్యాపారం చేస్తూ ఏడాది ప్రజల సొమ్ము అప్పనంగా వాడుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి.